క్లుప్తంగా

ఆర్.కృష్ణయ్యపై దాడి అమానుషం



మాట్లాడుతున్న కురువ సంఘం నేతలు

కర్నూలు (అర్బన్) : జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యపై దాడి చేయడం అమానుషమని జిల్లా కురువ సంఘం నేతలు అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కె.కిష్టన్న, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎం.కె.రంగస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ విభేదాలతో వ్యక్తులపై దాడులు చేసే సంస్కృతి ఎవరికీ మంచిది కాదన్నారు. కృష్ణయ్యపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కర్నూలు(అగ్రికల్చర్):నగరంలో విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్ పనులు చేపడుతున్న కారణంగా శనివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు డి1, క్యాంపస్ సెక్షన్ డీ-2 పరిధిల్లోని వివిధ కాలనీల్లో వివిధ పనులు చేస్తుండటంతో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. క్యాంపస్ సెక్షన్ డీ-2 పరిధిలోని మారుతీనగర్, సీ.క్యాంప్, గణేష్‌నగర్, రెవెన్యూ కాలనీ, 4వ తరగతి ఉద్యోగుల కాలనీ, సాయి వైభవ్‌నగర్, చెక్‌పోస్ట్ ఏరియా, శేషాద్రినగర్, బృందావన్ నగర్, మారుతీనగర్, మారుతీ మెగాసిటీ, పోస్టల్ కాలనీ, ధనలక్ష్మీనగర్, కమలానగర్, టెలికామ్‌నగర్, గఫార్‌నగర్, ప్రశాంతినగర్, ఫుడ్ కార్పొరేషన్ ఏరియా, కిసాన్‌నగర్, శ్రీనగర్ కాలనీ, లెక్చరర్స్ కాలనీ, మాధవనగర్, సీ అండ్ బీక్యాంపులు, గాయత్రీ ఎస్టేటు, లక్ష్మీనగర్ ఏరియాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించండి

కర్నూలు(సెంట్రల్): పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న డి.గౌస్‌దేశాయ్‌ని, నంద్యాల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జె.లక్ష్మీనరసింహను గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల కోరారు. శుక్రవారం ఆమె కల్లూరు అర్బన్‌లోని చింతలముని, భగవాన్, శివప్ప, ఎంఎస్ లక్ష్మీ, ఈశ్వరప్పనగర్‌లలో ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట నాయకులు ఎం.రాజశేఖర్, రమణమూర్తి, గోవిందు పాల్గొన్నారు.

శక్తిసదన్ సందర్శన



సదుపాయాలపై ఆరా తీస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి శుక్రవారం పలు ఆశ్రమాలను సందర్శించారు. గుత్తి పెట్రోల్ బంకు వద్ద ఉన్న శక్తిసదన్, మహిళా ప్రాంగణం, ప్రభుత్వ సర్వజన వైద్యశాలను సందర్శించారు. ఆ కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి అక్కడి సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు పరిశుభ్రతను పరిశీలించి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.

నేడు మహిళా సమ్మాన్ సేవింగ్స్‌పై స్పెషల్ డ్రైవ్

కర్నూలు (న్యూటౌన్): తపాలాశాఖ కర్నూలు డివిజన్ కార్యాలయంలో మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ) పథకం పొందేందుకు శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మహిళల కోసం సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ పథకంలో భాగంగా రెండేళ్ల కాల వ్యవధిలో రూ.2 లక్షలు డిపాజిట్ చేస్తే 7.5 శాతం వడ్డీతో చెల్లిస్తామని తెలిపారు. మహిళల కోసం కర్నూలు హెడ్ పోస్టాఫీసులో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు.

బొల్లవరంలో చోరీ

నందికొట్కూరు రూరల్ : బొల్లవరం గ్రామంలో గురువారం రాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మరియదాసు అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు పడి తులంన్నర బంగారు, రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బ్రాహ్మణకొట్కూరు పోలీసులు తెలిపారు.

వైభవంగా మేరిమాత తిరునాల

నందికొట్కూరు: శ్రీ ఆరోగ్యమాత కరుణ అందరిపై ఉందని ఉమ్మడి కర్నూలు జిల్లా ఆర్‌సీఎం చర్చి మేత్రాసన బిషప్ గోరంట్ల జ్ఞానేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని నందికొట్కూరు విచారణ పరిధిలో ఆర్‌సీఎం చర్చి ఆవరణలో మేరిమాత తిరునాల వైభవంగా జరిగింది.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ పోచా,



ర్యాలీకి హాజరైన జనం

- బాబువి అవకాశవాద రాజకీయాలు
- ముస్లింలకు రిజర్వేషన్లు అవసరం
- ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని
- కల్లూరు అర్బన్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

కల్లూరు: రాష్ట్రంలో ఈ ఐదేళ్ల సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలన అందించారని దీంతో మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అవే తమను గెలిపిస్తాయని నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 32, 33, 35వ వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కల్లూరు చెన్నమ్మ సర్కిల్ నుంచి ముజఫర్‌నగర్ వరకు నిర్వహించిన ర్యాలీలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో గుర్రవయ్యాలు, లంబాడీల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఓపెన్ టాప్ జీపుపై ర్యాలీ చేస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసానిని నాయకులు గజమాలతో సత్కరించారు.అనంతరం ఎంపీ మాట్లాడుతూ నంద్యాల పార్లమెంట్ పరిధిలోని ఎంపీ స్థానంతో



నృత్యం చేస్తున్న తండా మహిళలు

పాటు అన్ని అసెంబ్లీ స్థానాలు తాము గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. 2014 ఎన్నికల్లో టీడీపీ 600పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసిందన్నారు. దీంతో 2019 ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పి.. వైఎస్సార్‌సీపీకి అధికారం కట్టబెట్టారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేశామన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు బీజేపీ, జనసేనతో కలిసి వస్తున్నాడని నమ్మి మోసపోవద్దన్నారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అవసరమన్నారు. 2019 ఎన్నికల్లో నరేంద్రమోదీని ఎదుర్కొనే నాయకుడిని నేనే అంటూ చంద్రబాబు ప్రగల్భాలు పలికి ఇప్పుడు ఆయన పంచాన చేరారన్నారు. అధికారం కోసం అవకాశవాద రాజకీయాలు చేసే బాబుకు రాష్ట్ర ప్రజలు చిత్తుగా ఓడిస్తారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రభుత్వంతో పాటు, పార్టీలో ఎదిగేలా అవకాశం కల్పించిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో 32, 33, 35వ వార్డుల కార్పొరేటర్లు సాన శ్రీనివాసులు, ఎం.నరసింహులు, సాపురి మాధురి, పార్టీ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి శివ, ముస్లిం నాయకులు జిలాన్ బాషా, యూనస్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఆయా వార్డులోని స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

☛ అలాగే కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురంలో ఇంటింటికీ తిరుగుతూ ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అభ్యర్థించారు. మంచి చేసిన వారికి అండగా ఉండాలన్నారు. నవరత్నాల పథకాలు కొనసాగాలంటే మరోసారి రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నారాయణరెడ్డి, నాయకులు సత్యంరెడ్డి, సుబ్రహ్మణ్యం, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం రిజర్వేషన్లపై కూటమి కుట్రలు

ఎమ్మిగనూరుటౌన్: ముస్లింల రిజర్వేషన్లపై బీజేపీతో జతకట్టిన టీడీపీ కూటమి కుట్రలు పన్నుతోందని, ముస్లింలందరూ ఏకమై కూటమికి ఓటుతో బుద్ధి చెప్పాలని జిల్లా వక్ఫ్ బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, జామియా మసీదు అధ్యక్షుడు, కౌన్సిలర్ ఖాశీంబేగ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని బిలాల్ మసీదులో నమాజు అనంతరం వారు ముస్లింలను కలిసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుకను గెలిపించాలని కోరుతూ ఓట్లను అభ్యర్థించారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ల కొనసాగింపు సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమన్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తే రాబోవు రోజుల్లో ముస్లింల అభ్యున్నతికి మరింత కృషి చేస్తారన్నారు. ముస్లిం మైనారిటీ నాయకులు వాహిద్, ఇషాక్, షాబుద్దీన్, హాజీ వహాబ్, రసూల్, సయ్యద్ చాంద్, ఖిబులా హుసేన్, కొండాపురి రహంతుల్లా, రజాక్, అబ్రార్, గౌస్, ఫయాజ్, ఉబేద్ తదితరులు పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి శుక్రవారం భక్తులు విరాళాలు అందించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్ తెలిపారు. కోసిగికి చెందిన పాతు నాగరాజు కుటుంబసభ్యులు రూ.లక్ష, అలాగే కర్ణాటక రాష్ట్రం మాన్వి పట్టణ వాస్తవ్యులు సుమిత్ర నరసింహప్ప కుటుంబసభ్యులు రూ.లక్ష విరాళాన్ని అందించినట్లు చెప్పారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, శేష వస్త్రాలు, లడ్డూలను, బొండు, స్వామివారి ఫొటోను అందజేశారు. అలాగే శుక్రవారం బసవ జయంతి పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు వీరప్పస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

- ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ సదుపాయం
- పాణ్యం ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): మే 13వ తేదీన పాణ్యం నియోజకవర్గ పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య రాజకీయ పార్టీలకు సూచించారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ సదుపాయం కల్పించినట్లు చెప్పారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పాణ్యం నియోజకవర్గ సెక్టార్, ఇతర పోలింగ్ అధికారులతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..నియోజకవర్గంలో 64 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, వీటిలో అదనపు భద్రతతో పాటు మైక్రో అబ్జర్వర్లు, వీడియోగ్రఫీ తీయించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే పోలింగ్ సిబ్బందికి అన్ని రకాల శిక్షణ కార్యక్రమాలు పూర్తి అయ్యాయని, మే 12వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు డిస్పాచ్ సెంటర్ నుంచి పోలింగ్ సిబ్బంది కేంద్రాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత ఈవీఎంలను ప్రత్యేక వాహనాల్లో రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌కు తరలించనున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటలకు రాజకీయపార్టీలు ప్రచారాన్ని పరిసమాప్తం చేయాలని, శనివారం సాయంత్రం 6 నుంచి సోమవారం సాయంత్రం 7 గంటల వరకు మద్యం దుకాణాలను మూయాలన్నారు. శనివారం నుంచి నియోజకవర్గంలో ఉండే ఇతరులు బయటికి వెళ్లిపోవాలన్నారు. కాగా, ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన పనులను శనివారంలోపు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి పాల్గొన్నారు.

మంచి మనస్సున్న ఇంతియాజ్‌ను గెలిపించుకుందాం

- మోటివేషనల్ స్పీకర్ బ్రదర్ షఫీ



ప్రజాస్వామ్యంలో ప్రజల భద్రత అనే అంశంపై సభలో మాట్లాడుతున్న బ్రదర్ షఫీ

కర్నూలు (టౌన్): పేదలకు మంచి చేయాలనే మనస్సు కలిగిన మాజీ ఐఏఎస్, ఏఎండీ ఇంతియాజ్‌ను గెలిపించుకుందామని మోటివేషనల్ స్పీకర్ బ్రదర్ షఫీ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి స్థానిక పాతబస్తీలోని చౌక్ బజార్‌లో వైఎస్సార్‌సీపీ కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల బాధ్యత అనే అంశంపై నిర్వహించిన ఈ సభకు అతిథిగా బ్రదర్ షఫీ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాలన మంచిగా సాగాలంటే మంచి నేతలను ఎన్నుకోవాలన్నారు. ఉన్నతాధికారిగా సుదీర్ఘకాలం పనిచేసిన ఇంతియాజ్ వంటి వ్యక్తులను ఎన్నుకోవడం ద్వారా అభివృద్ధికి మరింత అవకాశం ఉంటుందన్నారు. కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ మాట్లాడుతూ జగనన్న పాలన నచ్చి తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. కర్నూలులో పుట్టి, పెరిగిన తనకు ఎమ్మెల్యేగా కర్నూలు నగర ప్రజలు అవకాశం ఇవ్వాలన్నారు. కర్నూలు అభివృద్ధిపై నిర్దిష్ట ప్రణాళిక తన వద్ద ఉందని, మరింత అభివృద్ధికి దోహదపడతానన్నారు. కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 2014 సంవత్సరం నుంచి కర్నూలులో వైఎస్సార్‌సీపీకి తిరుగు లేదన్నారు. 2014, 2019 సంవత్సరాల్లో ఫ్యాన్ అభ్యర్థులే విజయం సాధించారని, 2024లోనూ ఇదే పునరావృతమవుతుందన్నారు. ఇంతియాజ్ గెలుపుతో కర్నూలులో వైఎస్సార్‌సీపీ హ్యాట్రిక్ సాధిస్తుందన్నారు. సమావేశంలో కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ విజయ మనోహరి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అహ్మద్ అలీఖాన్, కార్పొరేటర్ షేక్ యూనుస్, పార్టీ నాయకులు ఖాదర్ బాషా, మగ్బూల్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

ఏఎండీ ఇంతియాజ్‌కు అవకాశమివ్వండి



ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్న సమీనా ఇంతియాజ్, చిత్రంలో ఎస్వీ విజయమనోహరి

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ కలెక్టర్ ఏఎండీ ఇంతియాజ్‌కు ప్రజాసేవ చేసేందుకు ఒక అవకాశమివ్వాలని ఇంతియాజ్ సతీమణి సమీనా ఇంతియాజ్ ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం రాత్రి స్థానిక 47 వ వార్డు పరిధిలోని ధర్మపేటలో ఆమె కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరితో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి జగనన్న మ్యానిఫెస్టో కరపత్రాలు అందజేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జగనన్న ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాలలు, ఆసుపత్రులను అభివృద్ధి చేశారన్నారు. పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీ హయాంలో పేదలకు జరిగిన మేలు శూన్యమన్నారు. ఆపార్టీ ఉన్నత వర్గాలకు మేలు చేసిందన్నారు. ఎస్వీ విజయ మనోహరి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటుందన్నారు. జూన్‌లో రెండోసారి జగనన్న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మధ్యలో నిలిచిన పథకాలన్నీ మంజూరు చేస్తారన్నారు. ఇందుకు ఎన్నికల్లో కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మార్పు చూసి ఓటు వేయండి

- వైఎస్సార్‌సీపీ పాలనలో ఆస్పత్రులు, స్కూళ్ల రూపురేఖలు మారాయి
- పథకాలతో ప్రజల జీవితాలకు భరోసా లభించింది
- టీడీపీని నమ్మితే మళ్లీ కష్టాలే
- కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కోట్ల హర్ష



మహిళలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్

కర్నూలు (సిటీ): ఒకవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు అభివృద్ధితో ఏపీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఐదేళ్లలోనే రాష్ట్రంలో గణనీయమార్పు కనబడుతుంద'ని వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. అమలవుతున్న పథకాలు, సాధించిన ప్రగతిని చూసి ఓటు వేయాలని కోరారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని బసాపురం, తొలిశాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఐదేళ్ల అధికారంలో ఉన్నా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఆ పార్టీ నాయకులు ప్రజలకు ఏం మేలు చేశారో చెప్పి ఓట్లు వేయమని అడగలేరని, వైఎస్ జగన్ తన పాలనలో మేలు జరిగి ఉంటేనే ఓటు వేయాలని అడుగుతున్న దమ్మున్న నాయకుడు అని పేర్కొన్నారు. జాబు రావాలంటే బాబు రావాలని ఊదరగొట్టి యువతను మోసం చేశారని.. అయితే వైఎస్సార్‌సీపీ పాలనలో సచివాలయాలు ఏర్పాటు చేసి లక్షల ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా పథకాలను అందజేశారని చెప్పారు. ఈ రోజు ఏ గ్రామానికి వెళ్లినా సచివాలయం దర్శనమిస్తోందని.. అందులో ప్రజలకు సేవలందించేందుకు 10 మంది ఉద్యోగులు, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ ఉన్నాయని తెలిపారు. టీడీపీ పాలనలో దుస్థితికి చేరుకున్న పాఠశాలలు నేడు కార్పొరేట్‌కు దీటుగా సుందరగా కనిపిస్తున్నాయన్నారు. పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం బోధన, డిజిటల్ విద్య అందుతున్నాయన్నారు. జగనన్న సిద్ధం, మేమంతా సిద్ధం సభలు, ప్రచారానికి వస్తున్న ఆదరణను చూసి టీడీపీ నేతల్లో ఓటమి భయం పట్టుకుందని తెలిపారు. ఆ భయంతోనే చంద్రబాబు నాయుడు సహనం కోల్పోయి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితంలో ఇచ్చిన హామీలను అమలు చేసిన చరిత్ర లేదన్నారు. జగనన్న ఇస్తున్న పథకాలతో శ్రీలంక అవుతుందని చెప్పిన చంద్రబాబు నాయుడు మరి ఇప్పుడు తాను ఇస్తున్న హామీలతో ఏం అవుతుందో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వాసు, నాయకులు మద్దిలేటి, నడిపి మద్దిలేటి, చిన్న మద్దిలేటి, వెంకట్రాముడు, కేశన్న, రామాంజనేయులు, సుంకన్న, ఈశ్వరయ్య, కె.హనుమంత రాజు, శ్రీనివాసులు, శివన్న, మధుసూదన్, కురువ మధు, స్వామి,అయ్యస్వామి,దస్తగిరి,తిరుమలేష్ పాల్గొన్నారు.

➡ **గూడూరు రోడ్‌షోకు విశేష స్పందన**

గూడూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి గూడూరులో శుక్రవారం నిర్వహించిన రోడ్‌షోకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం తెలిపారు.

➡ **నీతి..అవినీతికి మధ్య యుద్ధం**

పాత బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో బీవై రామయ్య మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు నీతి-అవినీతి, ధర్మం-అధర్మానికి జరిగే యుద్ధం అని తెలిపారు. అవినీతిపరుడైన చంద్రబాబును ఘోరంగా ఓడించాని పిలుపునిచ్చారు. పేదలకు మంచి జరగకుండా అడుగడుగునా కోర్టులకు వెళ్లి మోకాలు అడ్డుపెడుతున్న చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో గట్టి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మహిళలకు అందాల్సిన వైఎస్సార్ ఆసరా, చేయూత డబ్బులు అందకుండా చంద్రబాబు అడ్డుకున్నాడని విమర్శించారు. వృద్ధులకు ఇంటి వద్దే పింఛన్లు రాకుండా వలంటీర్లను దూరం చేశారని మండిపడ్డారు.

కట్టుదిట్టంగా ఎన్నికల సామగ్రి పంపిణీ



పోలింగ్ సామగ్రి పంపిణీ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కర్నూలు ఆర్‌ఓ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల సామగ్రి పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ అన్నారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులోని డిస్పాచ్ కేంద్రంలో విధులు నిర్వహించనున్న సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ డిస్పాచ్ కేంద్రంలో సెక్టార్ల వారీగా కౌంటర్లను ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాలకు అవసరమయ్యే ఎన్నికల సామగ్రిని పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. మెటీరియల్ చెక్‌లిస్టును అనుసరించాలన్నారు. డిస్పాచ్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు రవాణా కోసం వాహనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కర్నూలు నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాట్ల పరిశీలన

నగరంలోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో శుక్రవారం పోలింగ్ డిస్పాచ్ కేంద్రంలో ఏర్పాట్లను కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సకాలంలో వైద్య సేవలు అందించండి



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న హేమలత

ఓర్వకల్లు: సాధారణ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక జబ్బులు, గర్భిణులు, బాలింతలు, బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందించాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత అన్నారు. శుక్రవారం ఓర్వకల్లు మండలం హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎన్.కొంతలపాడులో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. రోగులకు అందజేస్తున్న వైద్య సేవలు, వైద్యుల పనితీరుపై ఆరా తీశారు. ఆరోగ్య సురక్ష క్యాంపులకు వచ్చే వారికి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, మూత్ర పరీక్షలతో పాటు, జ్వరం ఉన్న వారికి మలేరియా, డెంగీ వంటి 7 రకాల పరీక్షలను నిర్వహించాలని తెలిపారు. వైద్య పరీక్షల ఆధారంగా సేకరించిన వివరాలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాల్లో పారా మెడికల్ సిబ్బంది అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వైద్యులు అమర్నాథ్‌రెడ్డి, సత్యనారాయణ, పీహెచ్ఎన్ శిల్ప జ్యోతి, హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్, ఉన్నారు.

మల్లన్న సేవలో కర్ణాటక హైకోర్టు జడ్జి

ఆత్మకూరు : శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లను శుక్రవారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి బసవరాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేదపండితులు వారికి ఆశీర్వచనాలు పలుకగా, దేవస్థానం తరపున అధికారులు స్వామివారి శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

మహానందీశ్వరుడికి పల్లకోత్సవం

మహానంది: మహానందిలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, అర్చకులు మహానందీశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో పల్లకీలో కొలువైన స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం వైభవంగా జరిగింది.

మహానందిలో భక్తుల సందడి

మహానంది ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. అక్షయ తృతీయను పురస్కరించుకుని, సెలవు రోజులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చి శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.